సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



ముమ్మరంగా దర్యాప్తు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో చోరీలపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. వేలిముద్రలు సేకరించారు. 8లో ▸



బౌద్ధారామం.. సౌకర్యాలు శూన్యం

జీలకర్రగూడెం ప్రముఖ బౌద్ధారామంగా పేరొందినా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. 8లో ▸

విద్యుత్ ఎస్‌ఏఓకు చార్జిషీట్

ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌లో సీనియర్ అక్కౌంట్స్ అధికారిగా పనిచేస్తున్న సత్యకిషోర్‌కు ఆ సంస్థ సీఎండీ చార్జ్‌షీట్ జారీ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఏకధాటిగా వర్షం



తాడేపల్లిగూడెంలో కురుస్తున్న వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఇప్పటివరకు ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం కలిగింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

వసూళ్ల పర్వంపై విచారణ

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపంలో అక్రమ వసూళ్లపై 'సాక్షి' ప్రచురించిన కథనానికి ఆలయ ఈఓ గురువారం స్పందించారు. సిబ్బంది వసూళ్లపర్వంపై సెక్షన్ అధికారులను విచారణకు ఆదేశించారు. ఎకామిడేషన్ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం శ్రీవారి కొండపైన సీఆర్వో కార్యాలయంలో సిబ్బందిని విచారించారు. అలాగే పెళ్లి బృందాల నుంచి డబ్బులు వసూలు చేసింది ఎవరు అన్నదానిపై ఇంజనీరింగ్ విభాగ అధికారులు విచారణ చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే తమ వద్ద స్వీపర్ డిమాండ్ చేసి రూ.1,000 వసూలు చేసిందని అవసరమైతే లిఖిత పూర్వక ఫిర్యాదు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బాధితుడు మాదాసు బసవరాజు అంటున్నారు.

ఏలూరులో వందే భారత్‌కు హాల్ట్

ఏలూరు (టూటౌన్): విశాఖ–సికింద్రాబాద్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 25 నుంచి ఏలూరు రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇచ్చినట్టు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో గురువారం ప్రకటనలో తెలిపారు. విశాఖ-సికింద్రాబాద్ (20708) రైలు అదే రోజు సాయంత్రం 5.54 గంటలకు, సికింద్రాబాద్-విశాఖ (20707) రైలు ఉదయం 9.49 గంటలకు ఏలూరులో ఆగుతాయన్నారు.

వసతిగృహం ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రత్యేక అవసరాలు గల బాలికలకు వసతి గృహం ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతారాణి ప్రకటనలో తెలిపారు. ఆకివీడు మండలం పెదకాపవరంలో వసతి గృహం ఏర్పాటుచేయాల్సి ఉందని, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈనెల 28లోపు భీమవరం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

ఏలూరు (టూటౌన్)/నరసాపురం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలువురు మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఎ.భానుప్రతాప్‌ను నియమించారు. భీమవరం మున్సిపాల్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను సామర్లకోట కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆదోని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డిని భీమవరం కమిషనర్‌గా నియమించారు. నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ఒంగోలు కమిషనర్‌గా బదిలీ చేశారు. నరసాపురం కమిషనర్‌గా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. తాడేపల్లిగూడెం మున్సిపాల్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావును పెడన కమిషనర్‌గా నియమించారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక

భీమవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, రైస్ మిల్లర్స్ సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా 5.30 లక్షల టన్నులు పంట దిగుబడి అంచనా వేశామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 264 రైతు సహాయక కేంద్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం రవాణాకు మూడు వేల వాహనాలు, సుమారు 1.32 కోట్ల గోనె సంచులు అవసరమవుతాయన్నారు. రైతులు ధాన్యాన్ని వారికి సమీపంలో ఉన్న నచ్చిన రైసు మిల్లులకు తరలించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. కనీస మద్దతు ధర క్వింటాలు సాధారణ రకం రూ.2,300, గ్రేడ్ ఏ రకం రూ.2,320 అందిస్తామన్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్‌ఓ ఎన్.సరోజ, ఎఫ్‌సీఐ మేనేజర్ జి.రంజిత, జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది భద్రతలో లోపాలను ఎత్తిచూపిస్తోంది. రక్షణలో వైఫల్యాలు డాక్టరమ్మలను, మహిళా సిబ్బందిని కలవరపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని, పోలీస్ అవుట్‌పోస్టులు ఏర్పాటుచేసి మహిళా పోలీస్ సిబ్బందిని నియమించాలని వైద్యులు కోరుతున్నారు.

డాక్టరమ్మకు ఏదీ భద్రత?

ఆస్పత్రుల్లో రక్షణ కరువు

- రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వైద్యశాలలు
- జిల్లాలో 61 ప్రభుత్వ ఆస్పత్రులు
- మందుబాబుల వీరంగంతో వైద్యుల బెంబేలు
- పోలీస్ అవుట్‌పోస్టులు ఏర్పాటుచేయాలని వైద్యుల డిమాండ్
- పటిష్ట భద్రత కల్పించాలని, మౌలిక వసతులు సమకూర్చాలని వినతి

జిల్లాలో ఆస్పత్రులు

జిల్లా ఆరోగ్య కేంద్రం	ఏరియా అస్పత్రులు	కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	యూపీహెచ్‌సీలు
1	5	3	34	18



భీమవరం ప్రభుత్వాస్పత్రిలో రక్షణ గురించి చర్చించుకుంటున్న మహిళా వైద్యులు

సాక్షి, భీమవరం: జిల్లాలో జిల్లా ఆరోగ్య కేంద్రం, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు కలిపి మొత్తంగా 61 ఉన్నాయి. వీటిలో పది వరకు పీహెచ్‌సీలకు నైట్ వ్యాచ్‌మెన్ కొరత ఉంది. కొన్ని జనావాసాలకు దూరంగా ఉండటంతో రాత్రి వేళల్లో మందుబాబులు సమీపంలోని ఖాళీజాగాల్లో చేరి మద్యం, గంజాయి సేవిస్తూ వీరంగం సృష్టిస్తున్నారు. తణుకులోని జిల్లా కేంద్ర ఆస్పత్రి, భీమవరం, పాలకొల్లు, ఆకివీడు, నరసాపురం, తాడేపల్లిగూడెం తదితర సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల వద్ద పోలీస్ అవుట్ పోస్టులు, ఉమెన్‌సెల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పాలకొల్లు ఏరియా ఆస్పత్రిలో మహిళా సిబ్బందికి డ్రెస్సింగ్ రూం, వెయిటింగ్ హాల్ వంటి సదుపాయాలేమీ లేవు.

భద్రతాపై ప్రధాన డిమాండ్లు

- జిల్లా కేంద్రమైన భీమవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ అత్యంత సమీపంలోనే ఉంది.
- ప్రమాద, ఎమ్మెల్సీ ఘటనలకు సంబంధించిన కేసులు వచ్చినప్పుడు సంబంధిత స్టేషన్ వారే చూసుకోవాలని ఇక్కడి పోలీసులు చెబుతుండటంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని వైద్య సిబ్బంది చెబుతున్నారు.
- స్థానిక పోలీసులు కేసు నమోదుకు ముందుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- రాత్రి డ్యూటీ సమయంలో మహిళా వైద్య సిబ్బంది భద్రత దృష్ట్యా వారికి రక్షణగా మహిళా పోలీసులను విధుల్లో ఉంచాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు.
- మద్యం, ఇతర మత్తుపదార్థాలు సేవించి ఆస్పత్రికి వస్తున్న వారిని నిరోధించడానికి ఆస్పత్రి గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది పరిశీలించి నిలుపుదల చేయాలని అంటున్నారు.
- అర్ధరాత్రి అత్యవసర కేసుల్లో వచ్చే రోగుల వెంట ఉన్న వారి వద్ద దాడి చేసే ఆయుధాలు లేకుండా సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయాలని సూచిస్తున్నారు.

రాత్రి సెక్యూరిటీ పెంచాలి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పోలీస్ అవుట్‌పోస్ట్‌గా ఏర్పాటు చేసిన క్యాబిన్

తణుకులోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రోజూ 500లకు పైగా ఓపీ నమోదవుతుంది. జిల్లా నలుమూలల నుంచి వైద్యం నిమిత్తం ఇక్కడికి రోగులు వస్తుంటారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో రోడ్డు ప్రమాద కేసులతో పాటు తగాదాల్లో పరస్పర దాడులకు సంబంధించి రక్తమోడుతూ ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఆస్పత్రిలోని 150 బెడ్లు ఎప్పుడూ నిండి ఉండే పరిస్థితి. మహిళా వైద్యులతో పాటు రాత్రి సమయంలో ఆరుగురు నర్సులు విధుల్లో ఉంటారు. ఆస్పత్రి సెక్యూరిటీ విభాగంలో మహిళలు, పురుషులు కలిపి 13 మంది ఉన్నా రాత్రి సమయంలో ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. తరచూ ఆస్పత్రి వద్ద మద్యం మత్తులో వీరంగం చేసే వారితో మహిళా డాక్టర్లు, నర్సులు బెంబేలెత్తిపోతున్నారు. సెక్యూరిటీ సిబ్బందిపైనా తిరగబడటంతో పాటు తలుపులు, అద్దాలను ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. సిబ్బంది భద్రత దృష్ట్యా గతంలో ఆస్పత్రి వద్ద పోలీస్ అవుట్‌పోస్టు కోసం ప్రత్యేకంగా క్యాబిన్ ఏర్పాటుచేశారు. పోలీస్ సిబ్బంది నియామకానికి పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

రక్షణ పెంచాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార సంఘటన చాలా బాధాకరం. ప్రభుత్వాస్పత్రుల్లో జూనియర్ నుంచి సీనియర్ వరకూ మహిళా వైద్యులు రాత్రిళ్లు కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. రాత్రి వేళల్లో మహిళా వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి భద్రత కల్పించాలి. ఆస్పత్రిలో ఉండే సెక్యూరిటీ, మహిళా పోలీసులను వైద్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులుగాని, మత్తుపదార్థాలు సేవించి ఆస్పత్రిలోకి వస్తున్న వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ వి.మాధవి కళ్యాణి, సూపరింటెండెంట్, భీమవరం ప్రభుత్వాసుపత్రి

రాత్రిళ్లు పెట్రోలింగ్ తప్పనిసరి



వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై రోగులు, వారి తాలుకూ బంధువులు దాడులకు తెగబడుతున్నారు. రోజూ రాత్రి పూట రెండుసార్లు పోలీస్ పెట్రోలింగ్ చేయాలి. ఇటీవల కాలంలో సచివాలయ పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో వారి ద్వారా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందికి కొంత రక్షణ కలుగుతోంది. స్థానిక యువకులతో గస్తీ పోలీసులను ఏర్పాటు చేయించి, రాత్రిపూట పెట్రోలింగ్ చేయించాలి. సామాజిక దళంగా ఏర్పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఎండీ అజ్మీనా నజరిన్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, ఆకివీడు

పోలీస్ అవుట్‌పోస్ట్ తప్పనిసరి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి పోలీస్ అవుట్‌పోస్ట్ చాలా అవసరం. ఆస్పత్రికి రకరకాల జనం వస్తుంటారు. అందులో కొందరు విపరీతంగా మద్యం సేవించి వస్తుంటారు. ముఖ్యంగా రాత్రి సమయంలో మద్యం సేవించి ఆస్పత్రికి వచ్చేవారితో మహిళా వైద్యులు, నర్సులు, రోగులు, వారి సహాయకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మా సెక్యూరిటీ సిబ్బందిని చూసి భయపడే పరిస్థితి ఉండటం లేదు. యూనిఫామ్‌లో ఉండే పోలీసులు ఆస్పత్రిలో ఉంటేనే స్వేచ్ఛగా విధులు నిర్వర్తించగలం.

– డాక్టర్ వి.అరుణ, సూపరింటెండెంట్, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

టోకెన్ సిస్టమ్ ద్వారా..



రాత్రి సమయంలో కొన్ని కేసులు వస్తుంటాయి. అందులో కొందరు మద్యం సేవించి వస్తుంటారు. ఆ గొడవల్లో వారు ఏమి మాట్లాడుతున్నారో తెలియదు. మేం చెప్పేది వారికి అర్థం కాదు. సీరియస్ కేసులను వేరే ప్రాంతానికి రిఫర్ చేస్తే గొడవ పడుతున్నారు. పోలీస్ అవుట్‌పోస్ట్ పెట్టి ఆస్పత్రిలోకి వచ్చే వారికి టోకెన్ సిస్టమ్ పెట్టాలి. సెక్యూరిటీలో మహిళలు ఉండాలి. డ్యూటీ డాక్టర్లకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటుచేయాలి. ఆస్పత్రిలో డ్యూటీలో నర్సింగ్ స్టాఫ్‌గా మహిళలే ఎక్కువగా ఉంటారు.

– డాక్టర్ పియూష్, జనరల్ స్పెషల్, పాలకొల్లు ఏరియా ఆస్పత్రి

ఉమెన్ సెల్ కావాలి



ఆస్పత్రిలో తప్పనిసరిగా పోలీస్ అవుట్‌పోస్ట్ ఉండాలి. అలాగే ఉమెన్ సెల్ ఏర్పాటుచేయాలి. ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులకు సంబంధించి ప్రత్యేకించి ఎలాంటి సౌకర్యాలు లేవు. ప్రస్తుతానికి భద్రత అయితే ఏమీ లేదు. ముఖ్యంగా ఈ రెండు సౌకర్యాలు కల్పిస్తే ఒక రకంగా ప్రొటెక్షన్ ఉంటుంది. కోల్‌కతాలోని ఘటనతో మహిళా వైద్యులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. అన్ని ఆస్పత్రుల్లో భద్రతా వాతావరణంలో వైద్య సేవలందించేలా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–జయకుమారి, నర్సింగ్ స్టాఫ్ సూపరింటెండెంట్, పాలకొల్లు ఏరియా ఆస్పత్రి

దివ్యాంగులను ఆదరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



దివ్యాంగ పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఆదరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం శివరావుపేటలోని గాలి రామయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించారు. బోధనా వివరాలను ఆమె పరిశీలించి మాట్లాడుతూ జిల్లాలో 19 భవిత కేంద్రాలు ఉన్నాయని, 38 మంది ఉపాధ్యాయులు, ఏడుగురు ఫిజియోథెరపిస్టులు పనిచేస్తున్నారన్నారు. దివ్యాంగ చిన్నారులకు వీల్‌చైర్లు, కళ్లజోళ్లు, చెవిటి యంత్రాలు ఉచితంగా అందిస్తున్నామని, పిల్లలను కేంద్రాలకు తీసుకువచ్చే వారికి చార్జీల నిమిత్తం రూ.3 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. డీఈఓ జి.నాగమణి, ఎస్ఎస్‌వై పీఓ శ్యాంసుందర్, మధ్యాహ్న భోజనం-పాఠశాలల పారిశుధ్యం కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు, ఎంఈఓలు కలెక్టర్ వెంట ఉన్నారు.

లింగ నిర్ధారణ నేరం

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొత్తగా తొమ్మిది అల్ట్రా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

ఈఓ నియామకం.. కూటమి నేతల మధ్య వివాదం

- రూ.2 లక్షలకు బేరం కుదుర్చుకున్న టీడీపీ నేత కుమారుడు
- నియామకాన్ని అడ్డుకుంటామంటూ జనసేన నేతల సవాల్
- ఆచంట నియోజకవర్గంలో చర్చనీయాంశంగా ఈఓ బదిలీ వ్యవహారం

భీమవరం: దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) బదిలీ వ్యవహారం ఆచంట నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల మధ్య వివాదం రాజేసింది. నియోజకవర్గంలో ప్రముఖ దేవస్థానం ఈఓగా బదిలీ కోసం గతంలో అవినీతి ఆరోపణలున్న ఓ అధికారి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో టీడీపీ, జనసేన నేతల మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడినట్టు తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రముఖ ఆలయంలో ఈఓ పోస్టు కోసం సదరు అధికారి గత ప్రభుత్వ హయాంలోనూ ప్రయత్నించగా అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అంగీకరించలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎలాగైనా ఆ స్థానంలో పోస్టింగ్ కోసం ఆ అధికారి మరలా ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో ఆ అధికారి టీడీపీ ప్రజాప్రతినిధి కుమారుడితో మంతనాలు జరిపారని, తాను కోరిన స్థానానికి బదిలీ చేయిస్తే రూ.2 లక్షలు ఇస్తానని ఆఫర్ ఇచ్చారని విశ్వసనీయంగా తెలిసింది. ఇంకేముంది ప్రజాప్రతినిధి కుమారుడు సొమ్ములు తీసుకుని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసినట్టు సమాచారం. అయితే కూటమి ప్రభుత్వంలో ఉన్న తమ అభిప్రాయానికి విలువ ఇవ్వకుండా సొమ్ములు తీసుకుని ఎలా నియామకానికి అవకాశమిస్తారంటూ జనసేన నేతలు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారి నియామకాన్ని అడ్డుకుంటామని సవాల్ చేస్తున్నారు. ఈ వ్యవహారంతో నియోజకవర్గంలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య అగాధం ఏర్పడగా ఎటువంటి పరిస్థితులకు దారితీస్తుందోనని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

ఐటీఐ ప్రవేశాలకు 3వ కౌన్సెలింగ్

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం మూడో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26న సాయంత్రం 5 గంటలలోపు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో ఆన్‌లైన్ చేస్తారని, ఆన్‌లైన్ చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలన్నారు. ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తారని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రశీదుతో హాజరుకావాలన్నారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు వెల్డర్ కోర్సు (ఏడాది) అవకాశం ఉందన్నారు. వివరాలకు 08816-297093, 9676099988 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

40 రోజులు.. 40 వేల కనెక్షన్లు

- బీఎస్ఎన్ఎల్‌కు జై కొడుతున్న వినియోగదారులు
- కొత్త సిమ్‌లు, పోర్టబిలిటీకి ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో మరింత ఆదరణ
- ప్రైవేట్ ప్రొవైడర్ల టారిఫ్ పెంపు వల్లే..

మొబైల్ రీచార్జుల తాజా టారిఫ్‌లు

ప్రొవైడర్	గడువు	ప్యాకేజీ	రోజుకు డేటా
బీఎస్ఎన్ఎల్	82 రోజులు	రూ. 485	1.5 జీబీ
ఎయిర్‌టెల్	84 రోజులు	రూ. 859	1.5 జీబీ
జియో	82 రోజులు	రూ. 859	1.5 జీబీ



బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో వినియోగదారులు

ఏలూరు (టూటౌన్): ప్రైవేట్ టెలికాం సంస్థలు మొబైల్ రీచార్జులను భారీగా పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు క్యూకడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 40 రోజుల్లో 40 వేల కొత్త కనెక్షన్లను బీఎస్ఎన్ఎల్ జారీ చేసింది. కొత్త సిమ్‌లు, పోర్టబిలిటీల కోసం వచ్చిన వినియోగదారులతో జిల్లావ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్ల టారిఫ్ భారంగా మారడంతో బీఎస్ఎన్ఎల్ వైపు ఆసక్తి చూపుతున్నట్టు వినియోగదారులు చెబుతున్నారు. వీరిలో కొత్తగా సిమ్‌లు తీసుకునేవారు కొందరైతే.. పోర్టబిలిటీ ద్వారా సర్వీస్ ప్రొవైడర్‌ను మార్చుకునే వారు మరికొందరు ఉంటున్నారు.

జియో కస్టమర్లే అధికంగా.. బీఎస్ఎన్ఎల్‌కు మారే కస్టమర్లలో అధిక శాతం మంది జియో కస్టమర్లు ఉంటున్నారు. 70 శాతం మంది జియో నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారుతుండగా, 30 శాతం మంది ఎయిల్‌టెల్ కస్టమర్లు ఉంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు (దాదాపు 40 రోజుల్లో) సుమారు 40 వేల మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ బాట పట్టినట్టు అధికారులు చెబుతున్నారు. నెలాఖరు నాటికి మరో 10 వేల మంది వరకు కొత్త కస్టమర్లు వస్తారని భావిస్తున్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు ఇతర ప్రొవైడర్ల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు పోర్టబిలిటీలు 11,583 కనెక్షన్లు, కొత్త సిమ్‌లు 26,650 జారీ చేసినట్టు బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు.

సిమ్ రేట్ పెంచినా.. రెండు నెలల క్రితం వరకు బీఎస్ఎన్ఎల్ సిమ్ ధర కేవలం రూ.30 మాత్రమే. తాజాగా దానిని రూ.150కు పెంచారు. అయినా వినియోగదారులు ఇటుగా పెద్ద సంఖ్యలో మారుతుండటం విశేషం. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా నెలకు 1,000 సిమ్‌లు అమ్మడమే గగనంగా ఉండేది. తాజాగా వేలాది మంది బీఎస్ఎన్ఎల్ బాట పట్టడంపై సంస్థ అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో 4జీ, 5జీ సేవలు అందిస్తే బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం వస్తుందని పలువురు అంటున్నారు.

119 టవర్లతో 4జీ సేవలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 4జీ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తున్నాం. జిల్లాలో 119 టవర్లను 4జీ సేవల కోసం అనుసంధానం చేశాం. జిల్లాలో 2జీ/ 3జీ సిమ్‌ల వినియోగదారులు సుమారు 60 వేల మంది 4జీలోకి మారాల్సి ఉంది. వీరందరికీ 4జీ సిమ్‌లను ఉచితంగా ఇస్తున్నాం. టవర్ల సామర్థ్యం పెంపుతో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సామర్థ్యం పెరుగుతుంది. అత్యంత వేగంతో సిగ్నల్స్ అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎల్.శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ జీఎం

క్లుప్తంగా

నేడు వందలాది వివాహాలు

తాడేపల్లిగూడెం : శ్రావణంలో మంచి ముహూర్తాలు ఉండడంతో వేలాది జంటలు ఒక్కటవుతున్నాయి. ఈ నెల 23న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వందలాది వివాహాలు జరగనున్నాయి. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు సుమారు తొమ్మిది ముహూర్తాలు ఉన్నాయి. దీంతో కల్యాణ మండపాలన్నీ కళకళలాడుతున్నాయి.

పెళ్లి బృందాలను బెంబేలెత్తిస్తున్న హిజ్రాలు

అడిగినంత ఇవ్వకపోతే దౌర్జన్యాలు, తిట్లు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలో పెళ్లి బృందాలను కొందరు హిజ్రాలు బెంబేలెత్తిస్తున్నారు. రోజు రోజుకూ వారి ఆగడాలు ఎక్కువవుతున్నాయి. శ్రీవారి ఆలయ పరిసరాల్లో, కొండపైన, కొండ దిగువన సత్రాల్లో, ప్రైవేటు కల్యాణ మండపాల్లో సుముహూర్త సమయాల్లో భారీగా వివాహాలు జరుగుతాయి. కొందరు హిజ్రాలు పెళ్లి బృందాలను అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. వారు అడిగినంత ఇవ్వకపోతే తిట్టడం, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటివి చేస్తున్నారు. దాంతో మనకెందుకులే తలనొప్పని కొందరు వారు అడిగినంత ఇచ్చి దండం పెడుతున్నారు. ప్రైవేటు కల్యాణ మండపాల్లోకి దౌర్జన్యంగా ప్రవేశిస్తున్నారు. దౌర్జన్యాలు చేసే హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని భీమడోలు సీఐ బి.భీమేశ్వర రవికుమార్ ఎస్సై సుధీర్‌ను ఆదేశించారు.

'సైబర్' మాయ.. రూ.3 లక్షలు స్వాహా

ఏలూరు టౌన్: ఏలూరులోని ఒక వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ.3 లక్షలకు పైగా సొమ్మును సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు ఎంప్లాయీస్ కాలనీకి చెందిన దొండపాటి గోపాలరావు జిరాక్సు మిషన్లు, లేజర్ ప్రింటర్స్ సర్వీసు చేస్తాడు. షాప్ పెట్టుకునేందుకు ముద్రా లోన్ తీసుకున్నాడు. మంజూరైన రూ.5 లక్షలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూజివీడు బ్రాంచ్‌లో జమయ్యాయి. ఈ నెల 15న అకౌంట్ నుంచి రూ. 5,010 గుర్తుతెలియని వ్యక్తులు కాజేశారు. ఈ నెల 16న అతని అకౌంట్ నుంచి మళ్లీ రూ.3 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడు తనకు వచ్చిన మెసేజ్‌ల ద్వారా విషయం తెలుసుకుని బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. వారి సూచనల మేరకు ఏలూరులోని సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

సైబర్ నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : ఆన్‌లైన్ మోసంలో సొమ్ములు పోగొట్టుకున్న వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన మేటేపల్లి రాజేంద్రప్రసాద్ సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. రాజేంద్రప్రసాద్ మెసేజ్ లింక్‌ను ఓపెన్ చేయగా, వెంటనే రెండు వేర్వేరు ఖాతాల్లోకి మొత్తం రూ.2 లక్షలు బదిలీ అయ్యింది. వెంటనే అప్రమత్తమైన రాజేంద్రప్రసాద్ బ్యాంకు అధికారులను సంప్రదించగా, సైబర్ నేరంగా గుర్తించి, సైబర్ సెల్‌కు ఫిర్యాదుచేయాలని సూచించారన్నారు.

భార్యపై హత్యాయత్నం

ఏలూరు టౌన్: నగరంలో భార్యపై అనుమానంతో భర్త బ్లేడ్‌తో దాడి చేశాడు. బీడీ కాలనీకి చెందిన వీ.హేమలత, రవికుమార్ భార్యాభర్తలు.. కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. భార్యపై అనుమానంతో ఇద్దరి మధ్య తరచు గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి భర్త రవికుమార్ తన భార్య నిద్రపోతున్న సమయంలో బ్లేడ్‌తో పీక కోశాడు. తీవ్రగాయం కావటంతో ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బౌద్ధారామం.. సౌకర్యాలు శూన్యం

● గుంటుపల్లి గుహల్లో కానరాని వసతులు ● సందర్శకుల తాకిడి ఉన్నా పట్టించుకోని యంత్రాంగం

కామవరపుకోట: ఏలూరు జిల్లా జీలకర్రగూడెంలోని ప్రముఖ బౌద్ధారామంగా పేరొందినా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. ఇక్కడ ఉన్న గుంటుపల్లి గుహలు, బౌద్ధారామాలను సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఏటా కార్తీక మాసంలో ఇక్కడ గట్టు తీర్థం పేరుతో తిరునాళ్లు నిర్వహిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఈ ప్రాంతం పిక్నిక్ స్పాట్‌గా మారింది. అయితే ప్రధాన రహదారి నుంచి బౌద్ధారామాలకు చేరుకునే దారి సైతం అధ్వానంగా ఉంది. గుహల సముదాయం వద్ద సందర్శకులకు తాగునీరు వంటి కనీస వసతులు కూడా కరువయ్యాయి.

జీలకర్రగూడెంలోని గుంటుపల్లి బౌద్ధ గుహలు ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్నాయి. ఇక్కడి గుహలు, బౌద్ధారామాలను సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. మండల కేంద్రానికి 7 కిలోమీటర్లు, జిల్లా కేంద్రానికి 42 కిలోమీటర్లు, ద్వారకా తిరుమలకు 15 కిలోమీటర్ల దూరంలో ఈ ఆరామాలు ఉన్నాయి. ఈ గుహలను సందర్శించడానికి విదేశీయులు, బౌద్ధసన్యాసులు వస్తూ ఉంటారు. ఏటా కార్తీకమాసంలో ఇక్కడ తిరునాళ్లు నిర్వహిస్తారు. ఈ జిల్లాతోపాటు పొరుగు జిల్లాల నుంచి యాత్రికులు భారీగా తరలివస్తుంటారు. ఈ ప్రాంతంలో అడపాదడపా సినిమా షూటింగ్‌లు సైతం జరుగుతుంటాయి. కార్తీక మాసంలో అధిక సంఖ్యలో పాఠశాల విద్యార్థులు, ప్రజలు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఇక్కడ పిక్నిక్‌లు జరుపుకుంటారు. ఇక్కడ సరైన వసతి, తాగునీటి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రయితే చీకటిగా ఉంటుంది. ప్రధాన రహదారి నుంచి ఆరామాలకు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. సరైన భద్రత లేక అసాంఘిక కార్యకలాపాలకే వేదికగా మారడమే కాకుండా.. హత్యలు సైతం జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ పర్యాటక కేంద్రానికి ప్రత్యేక నిధులు కేటాయించి


కొండపైన బౌద్ధారామాల వద్ద పర్యాటకుల సందడి (ఫైల్)


కార్తీక మాసంలో పూజలు చేస్తున్న భక్తులు (ఫైల్)

అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించి, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలు కొండపైకి సులువుగా చేరుకునేలా రోప్‌వే ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



ఈ బౌద్ధారామాలు సందర్శించడానికి చుట్టుపక్కల ప్రాంత పర్యాటకులతో పాటు, దేశ విదేశాల నుంచి కూడా బౌద్ధ భిక్షువులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చే వారికి సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రదేశాన్ని పరిరక్షించడంతోపాటు, ప్రత్యేక నిధులు కేటాయించి ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలి.

– బొల్లు వెంకట సత్యనారాయణ, కామవరపుకోట

సదుపాయాలు లేవు



కార్తీక మాసంలో జిల్లా నలుమూలల నుంచి పిక్నిక్ కోసం అనేక ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కానీ ఇక్కడ సదుపాయాలు లేవు. సందర్శకులకు తాగేందుకు నీరు గాని, కూర్చోవడానికి సరైన సదుపాయాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– ధారావతు మల్లేష్, అధ్యాపకుడు, కామవరపుకోట

రోప్‌వే ఏర్పాటు చేయాలి



నిత్యం పర్యాటకులు వస్తుంటారు. సినిమాలు, నాటికలు, షార్ట్ ఫిలిమ్స్, ప్రీవెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ వంటి షూటింగ్‌లకు ఎంతో అనుకూలం. ఇక్కడికి వచ్చే వారికి కొండ పైకి నడుచుకుంటూ వెళ్లాలంటే చాలా కష్టం. పెద్దలు, దివ్యాంగుల కోసం ఇక్కడ రోప్ వే ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– వీరమల్ల మధుసూదనరావు, ఫొటోగ్రాఫర్, కామవరపుకోట

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్


వేగవరం వద్ద స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

దెందులూరు: దెందులూరు మండలం వేగవరం నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా సీజ్ చేశారు. గురువారం ఉదయం వేగవరం వద్ద మినీ లారీ డివైడర్ ఢీకొట్టడంతో అందులోని బియ్యం రోడ్డుపై పడిపడింది. దీంతో అటుగా వెళ్తున్న ఎస్‌ఐ కే.స్వామి రెవెన్యూ సిబ్బందికి అందించారు. రెవెన్యూ సిబ్బంది ఉదయం 8 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు మినీ లారీల్లో ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, రెండు మినీ లారీలను స్వాధీనం చేసుకున్నారు. సాంగల ప్రసాద్ డ్రైవర్, రేషన్ బియ్యం యజమాని సత్యంశెట్టి బాబి, జగ్గయ్యపై కేసు నమోదు చేశామని తహశీల్దార్ బీ.సుమతి వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కొయ్యలగూడెం: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జీజే విష్ణువర్ధన్ గురువారం పేర్కొన్నారు. రాజవరం సమీపంలోని ఎర్ర కాలువ నుంచి ఇసుకను ట్రాక్టర్లలో లోడు చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో చోరీపై ముమ్మరంగా దర్యాప్తు

నూజివీడు: ట్రిపుల్ ఐటీలో చోటు చేసుకున్న చోరీ సంఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఏలూరు నుంచి గురువారం డాగ్‌స్క్వాడ్‌ను రప్పించగా, జాగిలం దొంగతనం జరిగిన ఓ1 బ్లాకు నుంచి ఓ2 బ్లాకు వరకు వెళ్లి అక్కడి నుంచి దుండగులు పారిపోయిన ప్రదేశం వరకు వెళ్లి ఆగిపోయింది. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించిన నేపథ్యంలో క్వార్టర్స్‌లో ఉంటున్న వారి వేలిముద్రలను సైతం సేకరిస్తున్నారు. పాతనేరస్తుల వేలిముద్రలతో పోల్చుతున్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోగా స్థానిక పోలీసులు సైతం సాధ్యమైనంత త్వరగా కేసును ఛేదించడానికి అన్ని కోణాల్లో ముందుకు వెళ్తున్నారు. సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నారు. రెండు ఫ్లాట్‌లకు సంబంధించి వేసిన తాళాలు వేసినట్లే ఉండగా దొంగతనానికి పాల్పడ్డారు. 203 ఫ్లాట్‌లో ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ యెన్ని ప్రియాంక ఉంటున్నారు. ఆమె కుటుంబం 20 తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఫ్లాట్‌కు


ట్రిపుల్ ఐటీ క్వార్టర్స్ వద్ద డాగ్ స్క్వాడ్‌తో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

తాళం వేసి శ్రీకాకుళం వెళ్లారు. అదేరోజు రాత్రి దొంగలు పడి వెండి, బంగారు ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లారు. 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.90వేల విలువ చేసే డైమండ్ బ్రాస్‌లెట్, 550 గ్రాముల వెండి సామగ్రి, రూ.14,500 నగదు దొంగిలించారు. క్యాంపస్‌లో


ట్రిపుల్ ఐటీ గోడకున్న ఐరన్ ఫెన్సింగ్ కట్ చేసిన దొంగ

ఉన్న క్వార్టర్స్‌ల్లో దాదాపు 200 వరకు కుటుంబాలు నివాసముంటుండగా ప్రత్యేకంగా ఓ1 బ్లాక్‌లో దోచుకెళ్లడం, ఓ2 బ్లాక్‌లో ఖాళీ ఫ్లాట్ తాళాలు పగలగొట్టడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మెయిన్ గేటు వద్ద సెక్యూరిటీ ఉండటంతో గొడుగువారిగూడెం వైపు ఉన్న తోటల్లో నుంచి ప్రహరీగోడ పైభాగంలో ఉన్న ఫెన్సింగ్ వైరును కత్తిరించి క్యాంపస్‌లోకి అడుగు పెట్టి చోరీకి పాల్పడి అదే మార్గంలో వెళ్లారంటే క్యాంపస్ అంతా అవగాహన ఉన్నవారేనా అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

రాత్రి పూట ఎస్పీ తనిఖీలు

ఏలూరు టౌన్: రాత్రి వేళ.. విధుల్లో అలసత్వం వహించారో.. మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది రాత్రి వేళ జాగ్రత్తగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు తప్పవు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ 21 తేదీ అర్ధరాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత ఏలూరులోని కోర్టుగార్డ్, కలెక్టరేట్‌లోని ఈవీఎంలను భద్రపరిచిన గదుల వద్ద గార్డు డ్యూటీ సిబ్బంది పనితీరు పరిశీలించేందుకు తనిఖీ చేశారు. విధుల్లో సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు వీటి సమీపానికి రాకుండా జాగ్రత్తలు


ఏలూరు జిల్లా జాతీయ రహదారిపై రోడ్ సేఫ్టీ బృందాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ శివకిషోర్

తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ మొబైల్ పెట్రోలింగ్ వాహనాలను ఎస్పీ తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదం జరిగితే సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ప్రభుత్వ హాస్పిటల్స్‌కు తరలించటంలో కీలకపాత్ర పోషించాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

లింగపాలెం: ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ హెచ్చరించారు. మండలంలో బుధవారం అర్ధరాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్పీ పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి అనుమతులు లేకుండా రవాణా చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

విద్యా ప్రమాణాల్లో అగ్రస్థానంలో నిలుపుదాం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాను విద్యా ప్రమాణాలలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లాలో అమలవుతున్న విద్యా కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఈఓలు తరచు పాఠశాలలను సందర్శించి మెరుగైన విద్యాబోధనకు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పటిష్టంగా అమలు చేయాలని, నూరు శాతం పిల్లలు మధ్యాహ్నం భోజనం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అవసరమైతే మెనూలో చిన్న చిన్న మార్పులు చేసి వారికి ఇష్టమైనవి వండి అందించాలని సూచించారు. తరచూ విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు సమావేశమై వారికి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఫిర్యాదులు అందితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి, ఎస్ఎస్‌వై పీవో శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలు విజయవంతం చేయాలి

ఆగస్టు 23న ప్రారంభించనున్న గ్రామసభలను జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో విజయవంతం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గ్రామసభల ద్వారా గ్రామాల్లో అవసరాలను గుర్తించడం, అందుకు తగ్గ అభివృద్ధి పనుల నిర్వహణ కోసం ప్రణాళికలు రూపొందించుకుని గ్రామస్తుల సమక్షంలో ఆమోదిస్తామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు – ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలను నిర్వహిస్తారని.. పూర్తయిన వెంటనే ఈఎంఎంఎస్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు, మినిట్స్ నోట్ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, పశువుల షెడ్లు, మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టడం కోసం ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. సీజన్ వ్యాధులు, వ్యాక్సినేషన్, పశువులకు వైద్య చికిత్స పట్ల అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.


విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

విద్యుత్ ఎస్ఏఓకు చార్జిషీట్ జారీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌లో సీనియర్ అక్కౌంట్స్ అధికారిగా పని చేస్తున్న కే సత్యకిషోర్‌కు ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ ఇమ్మడి చార్జ్‌షీట్ జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పెన్షన్ కేసులను క్లియర్ చేయాలని సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆదేశాలున్నా ధిక్కరించారని చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. 15 రోజుల్లోగా సంతృప్తికరమైన సమాధానం అందకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

స్టాంప్ కలెక్షన్‌పై అవగాహన

ఏలూరు (టూటౌన్) : పోస్టల్ శాఖ నిర్వహించే ఫిలాటలీ స్టాంప్ కలెక్షన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు దీన్ దయాళ్ స్పర్శ్ యోజన 2024 ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేయనున్నట్లు ఏలూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్ బాబు తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6 నుంచి 9వ తరగతి చదువుకునే విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ప్రతి తరగతి నుంచి పదిమంది చొప్పున ఎంపిక చేసి నెలకు రూ.500 చొప్పున సంవత్సరానికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ అందిస్తారని తెలిపారు. పాఠశాల నుంచి ఎంత మంది విద్యార్థులు పాల్గొంటారో వారి పేర్లను నమోదు చేసి పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ-520003 చిరునామాకు సెప్టెంబర్ 16 లోపు పంపాలన్నారు.

దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గరికిముక్కు సుబ్బయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ఈ అంశంపై గురువారం వినతిపత్రం సమర్పించారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాలలో చేరిస్తే దాని పరిణామం దళిత హిందూ సమాజంపై చూపుతుందని వారి అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ రంగాలలో ఎస్సీలు పూర్తిగా వెనుకబడిపోతారని బీ.ఆర్.అంబేడ్కర్ చేసిన దీర్ఘకాల పోరాట ఫలితం వృథా అవుతుందని తెలిపారు. మతం మార్చుకున్న క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించడానికి వీలులేదని అనేక సందర్భాలలో ఉన్నత న్యాయస్థానాలు స్పష్టంగా తీర్పులు ఇచ్చాయని గుర్తు చేశారు. మతం మార్చుకున్న వారిని ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని వినతిపత్రంలో కోరారు.


కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక నాయకులు


ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో బస్సు కోసం ఎదురుచూపులు


ఫుట్‌బోర్డుపై ప్రమాదకర ప్రయాణం



● ప్రమాదమని తెలిసినా..

ఏలూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులు బస్సుల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. సరిపడా బస్సులు లేకపోవడంతో ఉన్న బస్సుల్లోనే కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. కళాశాలలు వదిలిన తరువాత సాయంత్రం గంటల తరబడి బస్సుల కోసం వేచిచూడాల్సిందే. వచ్చిన ఒక్క బస్సు వెళ్లిపోతే మళ్ళీ ఎప్పుడు వస్తుందో తెలియక చోటు లేకపోయినా ఎలాగోలా ఎక్కి ఇళ్లకు చేరుకునేందుకు పుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది స్పందించి తగినన్ని బస్సులు నడపాలని కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

మా బిల్లులు చెల్లించండి

కుక్కునూరు: గోదావరి వరదల సమయంలో పునరావాస కేంద్రాల వద్ద టెంట్, ఇతర సామన్లు అద్దెకు తీసుకోని వాటికి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని బాధిత యజమాని గురువారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించాడు. బాధితుడి వివరాల ప్రకారం దాచారం పంచాయతీకి చెందిన కొలూరి దిలీప్ టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు. గత నెల గోదావరి వరదల సమయంలో దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిర్వాసితులను పరామర్శించేందుకు అధికారులు వస్తుండడంతో టెంట్, గ్యాస్‌స్టౌవ్ ఇతర సామన్లను అధికారులు అద్దెకు తీసుకున్నారని చెప్పాడు. ఆ సామాన్లకు సంబంధించి రూ. 41 వేలు బిల్లు చెల్లించాలని.. అధికారులు నేటి వరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అడిగితే రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపాడు. వెంటనే బిల్లు చెల్లించాలని మొరపెట్టుకున్నాడు. మద్రిపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిర్వాసితులకు భోజనం వండిపెట్టిన వంటమాస్టర్‌కు రూ.5 వేలు ఇవ్వకపోవడంతో అతను కార్యాలయం ముందు బైఠాయించాడు. విలేకరులు రావడంతో డబ్బులను ఓ అధికారి చెల్లించారు.

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అత్తిలి ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

తణుకు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అత్తిలి మండలం నూతన కమిటీను గురువారం ఎన్నుకున్నారు. సమితి తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బదాసరి కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అబ్బదాసరి లాజర్ మాదిగ పాల్గొన్నారు. అత్తిలి మండల అధ్యక్షుడిగా గెడ్డం కిరణ్‌కుమార్ (అత్తిలి), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్లేటి వినయ్ (పాలి), ఉపాధ్యక్షుడిగా మెరిపే సత్యనారాయణ (ఉరదాళ్ల పాలెం), ప్రధాన కార్యదర్శిగా నేకూరి రవికుమార్ (బల్లిపాడు), కార్యనిర్వాహక కార్యదర్శిగా తానేటి మోహన్ (తిరుపతిపురం), కార్యదర్శిగా కోడెల్లి సత్యమూర్తి (ఉనికిలి) ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి



పట్టణంలో హెల్మెట్ వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో గురువారం పోలీస్ ఐలాండ్ వద్ద హెల్మెట్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు, ట్రాఫిక్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొగల్తూరు: మొక్కలు నాటుతున్న సర్పంచ్ మేరీ, వార్డు సభ్యులు, వైస్ ఎంపీపీ

మొగల్తూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రామ సర్పంచ్ పడవల మేరీ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన ప్లాంట్ ఫర్ మదర్ నేచర్ పిలుపు మేరకు గురువారం మొగల్తూరులోని పాలగుంట చెరువు ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కై లా సుబ్బారావు, వార్డు సభ్యులు ఎల్లమిల్లి మంగ, ఉపాధి హామీ పథకం జేఈ ఆనంద్, టీఏ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం

భీమవరం: స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవాకార్యక్రమాలు ప్రశంసనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మానవతా సేవా సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో క్విట్ ఇండియా స్థూపం నుంచి గురువారం చేపట్టిన శాంతి ర్యాలీని కలెక్టర్ నాగరాణి ప్రారంభించి మాట్లాడారు. భీమవరంలో మానవతా సేవా సంస్థ మొక్కలు నాటడం, పేదలకు సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మానవతా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స మోహన్‌వర్మ, వేమూరి రాంబాబు మాట్లాడుతూ 2003లో 103 మందితో మానవతా సంస్థ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రాష్ట్రంలోని 13 జిల్లాలో 70 వేల మంది సభ్యులతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుద్దరాజు వెంకటపతిరాజు, కారుమూరి ప్రసాద్, చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్, కంతేటి వెంకటరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, బొండా సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి

భీమవరం: రక్తదానంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బందెల హనుమంతరావు, ముమ్మన విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో యూనియన్ సభ్యులు రక్తదానం చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న అవసరాలకు సరిపడా రక్తం అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ అధినేత అల్లూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రక్తదానంపై అనేక అపోహలు ఉన్నాయని, వీటి నివృత్తి కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సాగు సాయం ఏదీ?

- అన్నదాతకు ఏడాదికి రూ.20వేలు హామీ ఇచ్చి ఊసెత్తని సీఎం చంద్రబాబు
- రైతుభరోసా పేరు మార్చారే తప్ప సాయంపై స్పష్టతనివ్వని కూటమి
- ఖరీఫ్ ప్రారంభమైనా అందని అన్నదాత సుఖీభవ



పెంటపాడులో నాట్లు వేస్తున్న మహిళలు

పెంటపాడు: రైతులకు టీడీపీ పాలనలో సాగు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశ పడిన రైతులకు నిరాశే మిగిలింది. రూ.20వేలు అందజేస్తామని హామీ గుప్పించిన సీఎం చంద్రబాబు రైతులకు మొండి చెయ్యి చూపారు. గత జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అంటూ మార్చారే తప్ప సాయం మాత్రం అందించలేదు. జూలై నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనుంచే వర్షాలు అనుకులంగానే కురిశాయి. అయితే వారం క్రితం కురిసిన వర్షాలు నారుమడులకు ఉపయోగపడ్డాయి. అయితే పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరశకు గురవుతున్నారు.అయితే దేవుడు కరుణించినా పూజారి కరుణించలేదన్న సామెత చందంగా కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరాశకు గురౌతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయంగా రూ.2వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయంపై ఊసే లేదు. మే లోనే రైతు భరోసా నగదు రూ.5,500 ఇవాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అది కాస్త ఆగిపోయింది. ప్రస్తుతం కేంద్రం అందజేసిన పీఎం కిసాన్ నగదుతో కూలీల ఖర్చులకు ఉపయోగపడింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.



ఇటీవల నాట్లు దెబ్బతినడంతో వ్యవసాయాధికారులను నష్టపరిహారం అడుగుతున్న రైతన్నలు(ఫైల్)

రైతుల ఎదురు చూపు

గూడెం నియోజకవర్గం జిల్లా ధాన్యాగారానికి పెట్టింది పేరు. ఇక్కడి నుంచి అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి అవుతుంది. డెల్టాలోని పెంటపాడు, మెట్టలోని గూడెం మండలాలలో 12,087 హెక్టార్లకు పైగా ఖరీఫ్ సాగు చేస్తున్నారు. వీటిలో ప్రధానంగా పెంటపాడు మండలంలో 10 వేల హెక్టార్లలో సుమారు 6,150 మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో పీఎం కిసాన్‌తో పాటు భరోసా ఒకేసారి అందుతుండడంతో పెట్టుబడికి ఉపయోగపడేది. ఇప్పుడు పీఎంకిసాన్ రూ.2వేలు మాత్రమే అందడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు రెండు నెలలు గడుస్తున్నా రైతుల పెట్టుబడి సాయంపై కనీసం ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభంలోనే పెట్టుబడి సాయం

గతంలో పంటల సాగు పెట్టుబడికోసం రైతన్నలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. పీఎం కిసాన్ సాయం రూ.6వేలు, రైతు భరోసా రూ.7,500 కలిసి ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతలుగా రైతులకు అందేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం రూ.20వేలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి. పంట పనులు ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు అప్పు చేయాల్సిన పని ఉండదు. ఇప్పటి వరకూ రైతులు పెట్టుబడి సహాయం కోసం ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

– దేవరెడ్డి రాంబాబు, కొండేపాడు

సమయం దాటితే ఉపయోగం ఉండదు



గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం ఖరీఫ్ పంట ప్రారంభంలోనే అందేది. ఈ సాయం రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ జరుగుతున్న ఇంత వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు. రైతులు వడ్డీలకు సొమ్ములు తెచ్చి సార్వా పెట్టుబడులు పెడుతున్నారు. సమయానికి కూటమి ఇస్తానన్న సాయం రూ. 20 వేలు ఇస్తే బాగుంటుంది. వెంటనే సాయం అందించాలి.

– గొర్రెల కోటేశ్వరరావు, పరిమెళ్ల

కొమ్మరలో ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు పోశిబాబు

అత్తిలి: మండలంలోని కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. విద్యార్థులు సంస్కృత భాష గొప్పతనాన్ని, రామాయణ, మహాభారతంలో ముఖ్య విషయాలను ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ నృత్యాలు, గీతాలను ఆలపించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో సంస్కృత భాష ఉపాధ్యాయుడు మాట్ల పోశిబాబు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జె నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

15న ట్రిపుల్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె ఆపరేషన్లు

పెంటపాడు: సెప్టెంబర్ 15న ప్రత్తిపాడు ట్రిపుల్‌ఎఫ్ ఆధ్వర్యంలో 1నుంచి 14 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఆస్పత్రి చిన్నపిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్ సుమన్ ఆపరేషన్‌లు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా గూడెం, తణుకు పరిసర ప్రాంతాల్లో ఉండే చిన్నారులకు గుండె సంబంధిత వ్యాధులు ఉంటే వారి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. గోరంట్ల శ్రీనవాసరెడ్డి, 99496 49519, గణేష్ 63042 40277 ఫోన్‌నెంబర్లలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలపై విచారణ చేపట్టాలి



తణుకు : సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న కార్మిక సంఘాల నేతలు



తాడేపల్లిగూడెం(టీఓసీ): పట్టణంలో నిరసన చేస్తున్న కార్మికులు

తణుకు: విశాఖపట్నం అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో రియక్టర్ పేలిచనిపోయిన, నెల్లూరు ఎఫ్.ఎ ఫ్.ఎఫ్ పరిశ్రమలో చనిపోయిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ. కోటి ఇవ్వాలని, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తణుకు నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ బుధవారం రాష్ట్రంలో రెండు పరిశ్రమల్లో 21మంది కార్మికులు అన్యాయంగా చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వానికైనా కార్మికులు వారి హక్కులు, రక్షణ అంటే చాలా చిన్న చూపు ఉందని విమర్శించారు. కార్మికుల చట్టాల్లో మార్పులు కారణంగా కార్మికులు జీవనం మరింత దుర్భరంగా మారిందన్నారు. గతంలో పాత కార్మిక చట్టాలు కారణంగా కార్మిక శాఖ, ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్ వర్గాలు అన్ని విషయాలపై తనిఖీలు నిర్వహించేవారన్నారు. ఏ పరిశ్రమలో కూడా కనీస ప్రమాదాలు పాటించడం లేదని అన్నారు. ప్రభుత్వం కార్మిక శాఖ, కార్మిక సంఘాలతో పరిశ్రమలలో భద్రతపై చర్చలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పి.దక్షిణామూర్తి, మండల కార్యదర్శి గుబ్బల గోపి, వాన్‌బరి యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు, గార రంగారావు, యు.బాబ్జి, సయ్యద్ రషీద్, జి.గోవిందరావు, వై.రమణ, పి.వెంకన్నబాబు, ఎస్.శ్రీనివాసరావు, అంబటి బ్రహ్మాజీ, తరుణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం ఫ్యాక్టరీలో ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అనకాపల్లి అచ్యుతాపురం సెజ్‌లో రసాయానికి ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలో శేషమహల్ సెంటర్‌లో జరిగిన నిరసనలో దానవరప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల పారిశ్రామిక ప్రమాదాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వ, ఫ్యాక్టరీ అధికారులు తనిఖీలు లేనికారణంగా, యాజమాన్యాలు లాభాపేక్షతో ఉండటంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాపోయారు. సెజ్‌లో రసాయనిక కర్మగారంలో జరిగిన భారీ ప్రమాదంలో ఇప్పటి వరకు 18 మంది కార్మికులు చనిపోయారన్నారు. సుమారు 50 మందికిపైగా కార్మికులు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైయారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం, యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. క్షతగ్రాతులకు తక్షణమే మెరుగైన వైద్యం అందజేయాలన్నారు. కార్మికులు రాము, అసిన్ బాష, హుస్సేన్, విజయ్, రామకృష్ణ, రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పెంటపాడు: సెక్టార్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెంటపాడు: బాల్యవివాహాలను అరికట్టేందుకు గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీలు పటిష్టంగా పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాతలు పేర్కొన్నారు. పెంటపాడు సెక్టార్ సమావేశంలో భాగంగా గురువారం పెంటపాడులోని ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యుక్త వయస్సు చిన్నారులకు అవగాహన కల్పించారు. 100 రోజులు శక్తి మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు బేటీ బచావో– బేటీ పడోవో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్ధాలు, బాలికల అక్రమ రవాణా, తదితర విషయాలను యుక్తవయస్సు బాలికలకు తెలియజేశారు. అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మరక్షణలో తర్ఫీదు పొందాలి

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు ఆత్మరక్షణ విద్యలో తర్ఫీదు పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జగన్నాథపురం నెం.139 అంగన్‌వాడీ కేంద్రంలో ఆత్మరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, వాటిని అడ్డుకునే చట్టాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రామలక్ష్మి, గీత, అంజికుమారి, ఎం.శాంతకుమారి, కే.గీత తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం నెం.139 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జెడ్పీ స్కూల్ గ్రౌండ్ అభివృద్ధికి కృషి చేస్తా

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ నిధులు, దాతల సహాయ సహకారాలతో సుమారు రూ. 10 లక్షలతో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్‌ను, గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జెడ్పీ హైస్కూల్ ప్లే గ్రౌండ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ నెల 9వ తేదీన సాక్షిలో క్రీడా మైదానాలు ఇలా ఆటలు ఆడేదెలా? అనే శీర్షికన కథనం వచ్చింది. దీనిపై స్పందించిన బొలిశెట్టి మాట్లాడుతూ మన స్కూల్ పేరుతో దాతలు జెడ్పీ గ్రౌండ్‌ను అభివృద్ధి చేసేందుకు మందుకు రావాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. గ్రౌండ్ అభివృద్ధికి తన వంతు విరాళంగా రూ. 50 వేలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



జెడ్పీ స్కూల్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టడీ సర్కిల్ ఏర్పాటు

తణుకు టౌన్: పట్టణంలోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలకు అవసరమయ్యే స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన రిటైర్డ్ బ్యాంక్ అధికారులు బీ బాపన్న శర్మ, డీటీ శ్రీనివాసరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఈ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈస్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఏపీపీఎస్సీ, బీఎస్ఆర్‌బీ, ఆర్ఆర్‌బీ, వంటి పోటీ పరీక్షలకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచామన్నారు. వీటితో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే ఇంగ్లీష్, అర్థమెటిక్స్, రీజనింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, భూపాల్, మారుతీదేవి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టడీ సర్కిల్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రసాయనిక ఎరువులు మితంగా వాడాలి

పెనుగొండ: వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు సిఫారసు మేరకు రసాయనిక ఎరువులు, సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు మితంగా వినియోగించడం రైతులు అలవాటు చేసుకోవాలని మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ అన్నారు. గురువారం పెనుగొండ మండలం చినమల్లంలో జీఏపీ–పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంటమాలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఏ ఆనందకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనం రైతులే తయారు చేసుకోనే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం కోసమే గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి స్పందన, శాస్త్రవేత్త డాక్టర్ జే దయాన్‌ప్రసాద్‌బాబు, డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చినమల్లంలో పొలంబడి కార్యక్రమం

నేడు గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు

తణుకు టౌన్: ఈనెల 23న తణుకు మండలంలోని గ్రామాల్లో గ్రామ పంచాయతీల ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు వేల్పూరు, కొమరవరం, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని తెలిపారు. ఈసభలకు మండల స్థాయి అధికారులను కన్వీనర్‌లుగా, ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని 31 గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపుపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామస్తుల నుంచి వచ్చిన పనుల జాబితాను స్వీకరించి గ్రామ సభలో ఆమోదించడం జరుగుతుందన్నారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

హాస్టల్ విద్యార్థినులకు బాసటగా ఉండాలి

భీమవరం: సంక్షేమ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థినులకు వసతి గృహ అధికారులు బాసటగా నిలవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ చిల్డ్రన్స్, కళాశాల వసతి గృహాలను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కూర్చుని వారికి వడ్డిస్తున్న పదార్థాలను రుచి చూశారు. బాగా చదువుకోవాలని, విద్య ద్వారానే అన్ని సాధించగలమని తెలిపారు. వసతి ఎలా ఉంది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అలాగే వంట చేసే ప్రదేశం కూడా శుభ్రంగా ఉండాలని జేసీ హాస్టల్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేయాలని ఈ సందర్భంగా తెలిపారు. జేసీ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి, వసతి గృహ అధికారులు, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మార్కెట్ ఫీడర్, ఈనాడు ఫీడర్, యాగర్లపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. టూ టౌన్‌లోని కొబ్బరితోట, యాగర్లపల్లి, రామచంద్రరావుపేటలలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే హౌసింగ్ బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు 33 బై 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ మాధవరం ఫీడర్ మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు: తణుకు నియోజకవర్గంలోని తణుకు, వేల్పూరు, ఇరగవరం, అత్తిలి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని లైన్లు మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. తణుకు మున్సిపల్ పరిధిలోని సజ్జాపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, తణుకు మండలం వేల్పూరు రైల్వేస్టేషన్ రోడ్డు, విష్ణుప్రియ నగర్, వీరభద్రపురం, ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు, సూరంపూడి, కె.ఇల్లిందలపర్రు, కె.కుముదవల్లి, అత్తిలి మండలంలోని అత్తిలి, పాలి, ఉరదాళ్లపాలెం, పాలూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తణుకులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

తణుకు టౌన్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పీ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తణుకు ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు గురువారం రాష్ట్రపతి రోడ్డు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలి హత్యను తీవ్రంగా ఖండించాలని కోరారు. ఇటువంటి సంఘనలపై ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం పట్టణంలోని ప్రధాన కూడలిలోవిద్యార్థినీ, విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ మారుతీదేవి చౌదరి, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

యాత్రికుల వసతి సముదాయానికి శంకుస్థాపన

పెనుగొండ: తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ యాత్రికుల వసతి గృహ సముదాయ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. గురువారం పెనుగొండలో వాసవీ శాంతిధాం సమీపంలో తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ సభ్యులు శంకుస్థాపనను వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి పితాని తనయుడు వెంకట్, స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యులు పులవర్తి రెడ్డియ్య గుప్తా పాల్గొన్నారు.